క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక



విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ఉయ్యాలవాడ : ఈ నెల 14వ తేదీన విశాఖ పట్నంలో జరిగే రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు నరసింహుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కొండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న శ్రీకీర్తి, నాగప్రియ జిల్లా స్థాయిలో ఆర్‌బీఐ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారని చెప్పారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులను అభినందించారు.

బీమా తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: మండలంలోని జి.జంబులదిన్నె గ్రామానికి చెందిన తిరుపాల్ అనే వ్యక్తి ఇటీవల గుండెపోటుతో మరణించాడు. మృతుడు వైఎస్సార్ బీమా పథకానికి అర్హుడు కావడంతో తక్షణ సాయంగా రూ.10వేల నగదును గురువారం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మృతుడి కుటుంబ సభ్యుడికి అందజేశారు.

నంద్యాల(సిటీ): పట్టణంలోని ఇందిరా నగర్‌లో నివాసం ఉంటున్న బాలస్వామి గురువారం మృతి చెందాడు.మృతుడు వైఎస్సార్ బీమాకు లబ్ధిదారు కావడంతో తక్షణ సాయం కింద రూ.10వేలను ఆయన భార్యకు 21వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అనిల్ అమృతరాజ్ అందజేశారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో అగ్ని ప్రమాదం

ఆళ్లగడ్డ: పట్టణంలోని టీబీ రోడ్డులోనున్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో గురువారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఏసీలు, కంప్యూటర్లు, ఇతర సామగ్రి కాలిబూడిదయ్యాయని, అగ్ని ప్రమాదంతో తీవ్ర నష్టం జరిగిందని బ్యాంకు మేనేజర్ ఖలీల్ తెలిపారు.

వైభవంగా మహానగర సంకీర్తన

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఇస్కాన్ ప్రచార కేంద్రం నుంచి గురువారం సాయంత్రం అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ఆధ్వర్యంలో మహానగర సంకీర్తన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. నిర్వాహకులు భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణుడిని స్మరించుకుంటూ భజనలు, నృత్యాలతో సంకీర్తన శ్రీనివాస నగర్, సంజీవనగర్, కోదండ రామాలయం వరకు కొనసాగింది. అనంతరం భక్తులకు స్వామి వారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

సుబ్రహ్మణ్యం సేవలు చిరస్మరణీయం



డాక్టర్ గెలివి సుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైద్యులు

నంద్యాలటౌన్: పట్టణంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన డాక్టర్ గెలివి సుబ్రహ్మణ్యం ప్రజలకు చేసిన వైద్య సేవలు మరువలేనివని ఆయన లేని లోటు తీర్చలేనిదని రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా నంద్యాలలో సాయిబాబా దేవాలయం, వాసవి వృద్ధాశ్రమంలో ఎన్నో విలువైన వైద్య సేవలు అందించారని గుర్తు చేశారు. అనంతరం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్లు సహదేవుడు, జఫ్రుల్లా, మధుసూదనరావు, చంద్రశేఖర్, సాయికృష్ణ, లక్ష్మీసౌజన్య పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం

దొర్నిపాడు: జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంతో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని డీఐఓఎస్ చెన్నయ్య తెలిపారు. గురువారం మండలంలోని గుండుపాపల గ్రామంలో భూసర్వే పూర్తి కావడంతో రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో భూసర్వే వందశాతం పూర్తయ్యిందన్నారు. రికార్డుల్లో వివరాలు సక్రమంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణీత సమయంలోనే సర్వే పనులను పూర్తి చేయడంపై మండల సర్వేయర్ మల్లయ్యను అభినందించారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ బాల వెంకటరెడ్డి, మండల సర్వేయర్ మల్లయ్య, సర్పంచ్ వెంకటేశ్వర్లు, వీఆర్‌ఓ మురళీమోహన్, కార్యదర్శి వెంకటనారాయణ, సర్వేయర్ ప్రశాంతి పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

దొర్నిపాడు: బుర్రారెడ్డిపల్లె సచివాలయ పరిధిలో శుక్రవారం జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై గురువారం ఎంపీడీఓ సచివాలయ ఉద్యోగులు, వీఆర్‌ఓ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వలంటీర్లకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న 11 ఉచిత ధ్రువ పత్రాల్లో ఏ క్లస్టర్‌కు ఎన్ని దరఖాస్తులు వచ్చాయానే వాటిపై ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శి మహేష్, వీఆర్‌ఓ నారాయణస్వామి పాల్గొన్నారు.



ఈమె పేరు కోనేటి సునీత. ఉయ్యాలవాడ మండలం అల్లూరు గ్రామంలో వ్యవసాయ కూలీ. గతంలో పిల్లల చదువు కోసం వారికి కావల్సిన వివిధ ధ్రువ పత్రాల కోసం కూలీ పని మానుకుని మండల కేంద్రానికి వెళ్లి తహశీల్దార్ కార్యాలయం చుటూ మూడు వారాలు తిరిగింది. అయినా నాడు పనులు పూర్తి కాలేదు. అయితే ప్రస్తుతం గ్రామ వలంటీర్ ఇంటికి వచ్చి ధ్రువ పత్రాలకు అవసరమైన పత్రాలను తీసుకెళ్లి రెండు రోజుల్లోనే గ్రామంలోని సచివాలయం వద్దకు పిలిపించి అధికారులతో ఆదాయ, కుల ధ్రువ పత్రాలు అందజేశారు. గతంలోలా ఇబ్బందులు లేకుండా అందజేయడంతో సంతోషం వ్యక్తం చేసింది.



కౌలు కార్డును చూపుతున్న రైతు పేరు హేసేన్‌సా. క్రిష్టిపాడు గ్రామంలో కొంత భూమిని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తుంటాడు. ఈయనకు జగనన్న సురక్ష పథకంలో భాగంగా ఉచితంగా కౌలుకార్డును ఇచ్చారు. గతంలో ఈయన కౌలు కార్డు పొందడానికి అవస్థలు పడ్డానని, ప్రస్తుతం అధికారులు, వలంటీర్లు భూ యజమానులతో మాట్లాడి ఒక్క రోజులోనే ఊర్లోనే కార్డు అందజేయడంపై సంతోషం వ్యక్తం చేశాడు. ఈ కార్డుతో తాను ప్రభుత్వం అందజేసే పథకాలకు అర్హత పొందుతానని ఆయన చెబుతున్నాడు.

నాణ్యత..ఆకర్షణీయం

- నాణ్యమైన కాగితం, ఆకర్షణీయమైన రంగులు, ఆయిల్ ప్రింటింగ్‌తో పాఠ్యపుస్తకాలు
- జిల్లాలో సెమిస్టర్-1కు 14,28,672 పుస్తకాల పంపిణీ
- ఆన్‌లైన్‌లో అదనపు సమాచారం పొందేందుకు పాఠ్యాంశాలకు క్యూ ఆర్ కోడింగ్ ఏర్పాటు
- పుస్తకాలకు కోడింగ్ నంబర్లు
- కొత్త పాఠ్యపుస్తకాలపై విద్యార్థుల ఆసక్తి
- త్వరలో సెమిస్టర్-2 పుస్తకాల రాక



నంద్యాల(న్యూటౌన్): బడి గంట మోగిన తొలిరోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కింద పాఠ్య పుస్తకాలను అందజేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈమేరకు విద్యార్థులకు పాఠశాలలు పునఃప్రారంభించిన రోజే పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. అయితే ఎన్నడూ లేని విధంగా ఈ సారి అందజేసిన పుస్తకాల ముద్రణ ఎంతగానో ఆకట్టుకుంటోంది.

కొత్త కొత్తగా..

విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా నూతన పాఠ్యపుస్తకాలను కొత్త హంగులతో నాణ్యతగా తయారు చేసి విద్యార్థులకు అందజేశారు. ఆకట్టుకునే చిత్రాలు, అందమైన కవర్ పేజీలతో రూపొందించిన ఈ పుస్తకాలు చదువుకునేలా విద్యార్థులను ప్రేరేపిస్తున్నాయి. ఆకర్షణీయ చిత్రాలు, కార్టూన్లు, రంగులు, నాణ్యమైన పేపర్, ఆయిల్ ప్రింటింగ్‌తో అందిన పుస్తకాలను విద్యార్థులు మురిపెంగా చూసుకుంటున్నారు.

పుస్తకాలకు కోడింగ్ నంబర్లు..

విద్యార్థులకు పుస్తకాల పంపిణీని పాఠశాల విద్యాశాఖ ఈ ఏడాది పకడ్బందీగా చేపట్టింది. సబ్జెక్టులు, సెమిస్టర్ల వారీగా పుస్తకాలను అందజేశారు. పుస్తకాలు దుర్వినియోగం కాకుండా విద్యార్థుల సంఖ్య ఆధారంగా పంపిణీ చేశారు.

చిత్రాలు, రంగులతో కొత్త రూపు..

ప్రభుత్వం పంపిణీ చేసిన పుస్తకాల ముద్రణ, నాణ్యతకు మారుపేరుగా నిలుస్తున్నాయి. చూడగానే విద్యార్థులను ఆకట్టుకునేలా చిత్రాలు, టేబుల్స్, ఆకర్షణీయమైన రంగులతో నిండి ఉన్నాయి. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు పెద్ద పెద్ద బొమ్మలను విభిన్న రంగుల్లో ఆకట్టుకునేలా వేసి నాణ్యమైన కాగితాలపై ముద్రించారు. కవర్‌పేజీతో పాటు లోపలి పేజీలు కూడా పాఠ్యాంశాల వారీగా అందంగా కనిపిస్తున్నాయి.పై తరగతుల వారికి కూడా ఆయా సబ్జెక్టు పుస్తకాల్లో క్యూఆర్ కోడ్‌తో కూడిన వీడియో వివరణలను అందుబాటులో ఉంచారు. పుస్తకంలో ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్ ద్వారా స్కాన్ చేసిన వెంటనే సంబంధిత విషయానికి సంబంధించిన అదనపు సమాచారంతో కూడిన వీడియోలు అందుబాటులోకి వచ్చేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. దీంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సైతం కొత్త పాఠ్యపుస్తకాలపై ఆసక్తి చూపుతున్నారు.

సెమిస్టర్ల వారీగా..

ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను సెమిస్టర్ల వారీగా ముద్రించింది. గత ఏడాది మూడేసి సెమిస్టర్లను ముద్రించగా ఈ ఏడాది రెండు సెమిస్టర్లకు కుదించారు. దీని వల్ల టైటిల్స్ సంఖ్య కూడా తగ్గింది. ప్రస్తుతం 1 నుంచి 10వ తరగతులకు లాంగ్వేజ్, నాన్ లాంగ్వేజ్ కలిపి 113 టైటిల్స్ ముద్రించారు. నంద్యాల జిల్లాలో పాఠ్యపుస్తకాలు 12,06,323, వర్క్ బుక్స్ 2,22,349 కలిపి మొత్తం 14,28,672 పుస్తకాలను సెమిస్టర్ వన్ కింద అందజేశారు. సెమిస్టర్ 2 పుస్తకాలను త్వరలో పంపిణీ చేయనున్నారు.

పుస్తకాలు చాలా బాగున్నాయి



ఈ ఏడాది అందజేసిన పుస్తకాలు కొత్త కొత్త రంగులతో చాలా బాగున్నాయి. చదువుకునేందుకు ఆకర్షణగా ఉన్నాయి. అంతేగాక 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ, ఇంగ్లిష్ మీడియంలో బోధన, డిజిటల్ చదువులతో పాఠ్యాంశాలు అర్థమయ్యే రీతిలో ఉన్నాయి. పాఠ్యపుస్తకాలపై ఉన్న చిత్రాలు విద్యపై ఆసక్తి పెంపొందింపజేస్తున్నాయి.

– ఆనందరాజ్, 9వ తరగతి, నూనెపల్లి బాలుర పాఠశాల, నంద్యాల

పుస్తకాలు నాణ్యతగా ఉన్నాయి



ప్రభుత్వ పాఠశాలలో అందించిన పాఠ్యపుస్తకాలు నాణ్యతగా ఉన్నాయి. పాఠశాల తెరిచిన రోజే పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగు, యూనిఫాం కిట్టు అందించారు. పాఠ్య పుస్తకాలు రంగురంగులతో పాఠ్యాంశాల వారీగా అందంగా ఉన్నాయి. ఆయా సబ్జెక్టు పుస్తకాల్లో క్యూఆర్ కోడ్‌తో కూడిన వీడియో వివరణలను అందుబాటులో ఉంచారు. అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను ముద్రించడంతో మాకెంతో ఉపయోగకరం.

– మౌనిక, పదవ తరగతి, బాలికల పాఠశాల, నంద్యాల

ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా ఉన్నాయి

ఈ ఏడాది పాఠ్యపుస్తకాలు వర్క్‌బుక్స్‌ను వంద శాతం పాఠశాలలకు చేరవేశాం. పాఠ్యపుస్తకాలను నాణ్యమైన పేపర్‌తో ముద్రించారు. అక్షరాలు స్పష్టంగా అర్థమయ్యేలా ఉన్నాయి. చూడచక్కగా ఉన్న పాఠ్యపుస్తకాలు విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పాఠ్యాంశాలకు క్యూఆర్ కోడ్ ఇచ్చారు. దీన్ని స్మార్ట్ ఫోన్‌తో స్కాన్ చేస్తే చాలు ఆ పాఠ్యాంశానికి సంబంధించిన అదనపు సమాచారం, వీడియోలు, చిత్రాలను చూడవచ్చు. ఇది చాలా ఆధునిక, ఖర్చుతో కూడుకున్న విధానం.

–సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

ఫుడ్ కమిషన్ చైర్మన్ ఆకస్మిక తనిఖీలు

నంద్యాల(అర్బన్): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు వచ్చిన రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాపరెడ్డి తనిఖీలతో హోరెత్తించారు. చైర్మన్ నంద్యాల జిల్లా పర్యటనకు వస్తున్నారని తెలిసి పలువురు అధికారులు కిందిస్థాయి సిబ్బంది, రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు హడలిపోయారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన తనిఖీల్లో మొదట గాజులపల్లె గ్రామం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన అనంతరం నంద్యాల మండలం అయ్యలూరులోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులను పరిశీలించి అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. పొన్నాపురం, క్రాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్, పౌష్టికాహారాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న కృషిని మెచ్చుకొని వారిని సత్కరించి ఒక్కొక్కరికి రూ.వెయ్యి నగదు ప్రోత్సాహాన్ని అందించారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మరింత నాణ్యతగా వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. మధ్యాహ్నం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని బాలికల జూనియర్ కళాశాల వసతి గృహం, తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని ఎస్టీ బాలికల జూనియర్ కళాశాల వసతి గృహం, వైఎస్సార్‌నగర్‌లోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న మెనూ వివరాలను తెలుసుకోవడంతో పాటు బొమ్మలసత్రం వద్ద ఉన్న బాలికల సమీకృత వసతి గృహంలో అందుతున్న మెనూ, సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గాజులపల్లెలో 12వ రేషన్ దుకాణం, అయ్యలూరులోని 37వ రేషన్ షాపులోని ఈపాస్ మిషన్‌లో స్టాక్ వివరాలను పరిశీలించారు. పొన్నాపురంలో ఎండీయూ రేషన్ వాహనం ద్వారా కార్డు దారులకు అందుతున్న సరుకులను పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో జిల్లా స్థాయి రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో మాట్లాడారు. అనంతరం కమీషన్ పెంచాలంటూ డీలర్లు, ప్రజా పంపిణీలో రెండు వేలిముద్రల సిస్టమ్‌ను తొలగించాలంటూ ఎండీయూలు ఆయనకు వినతి పత్రాలు ఇచ్చారు. వైఎస్సార్ నగర్‌లోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణతో కలిసి పరిశీలించారు. సాయంత్రం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పర్యటన వివరాలను తెలిపారు. ఐసీడీఎస్ పీడీ నిర్మల, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి చింతామణి, బీసీ, ఎస్టీ సంక్షేమ అధికారులు లక్ష్మీదేవి, పి.జగన్నాథరావు, డీఎస్‌ఓ జగన్‌మోహన్, వార్డెన్‌లు శంకరమ్మ, సువర్ణ, సుధారాణి, సీఎస్‌డీటీ ప్రసాదరావు పాల్గొన్నారు.



గాజులపల్లె ఎంపీపీ ఆదర్శ పాఠశాలలో కోడిగుడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న విజయప్రతాపరెడ్డి

జగనన్న సురక్షతో అర్హులకు పథకాలు



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న పీపీ నాగిరెడ్డి



పెద్ద వంగళిలో ధ్రువ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

గోస్పాడు: అర్హులందరికీ పథకాలు అందజేసేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి తెలిపారు. మండలంలోని సాంబవరం గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ నవరత్నాల పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలని పథకాలకు దూరంగా ఉన్న అర్హులను గుర్తించి 11 రకాల ధ్రువ పత్రాలు అందజేసి వారికి లబ్ధి చేకూర్చడం అభినందనీయమన్నారు. గ్రామంలో మొత్తం 272 మందికి ధ్రువ పత్రాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమన్, సర్పంచ్ ఐజయ్య, ఎంపీటీసీ భారతి, నాయకులు బొరెడ్డి గోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, చిన్నరాజన్న,శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: జగనన్న సురక్షతో అర్హులకు పథకాలు అందుతాయని ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం రూరల్ మండలం మిట్టపల్లె గ్రామంలో ప్రజలకు మొత్తం 156 మంది దరఖాస్తు చేసుకోగా 154 మందికి టోకెన్లు ఇచ్చారు. వారిలో 118 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈఓపీఆర్డీ తోహేరా హుసేన్ పాల్గొన్నారు

ఉయ్యాలవాడ : సాంకేతిక, ఇతర కారణాల వల్ల మిగిలిపోయిన అర్హులను గుర్తించి న్యాయం చేసేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అన్నారు. గురువారం మండలంలోని హరివరం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నడిపెన్న, ఉప సర్పంచ్ ఎర్రి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పెద్ద పేరయ్య, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు ఆధ్వర్యంలో టోకెన్లు పొందిన 120 మందికి ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. సింగిల్‌విండో అధ్యక్షుడు పల్లె మహేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ తరిగోపుల ప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌బాబు పాల్గొన్నారు.

చాగలమర్రి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెద్ద బోధనం గ్రామ సర్పంచ్ ముడియం శివమ్మ, చిన్న బోధనం సర్పంచ్ యామానరసమ్మ కోరారు. మండలంలోని పెద్ద బోధనం సచివాలయ కార్యాలయ ఆవరణలో గురువారం జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాన్ని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా అధ్యక్షతన నిర్వహించారు. పెద్ద బోధనం, చిన్న బోధనం, మజరా గ్రామమైన తిప్పనపల్లె గ్రామాల్లో 321 మందికి టోకెన్లు ఇవ్వగా వాటిలో 154 కుల, 153 ఆదాయ ధ్రువ పత్రాలు, 10 రేషన్ కార్డులో కొత్తపేర్లు నమోదు, 7 రీ ఎంట్రీ పత్రాలు శిబిరంలో అందజేశారు. ఆధార్‌కు సెల్ నెంబరు లింకు చేశారు. ఈఓపీఆర్‌డీ సుదర్శనరావు, పంచాయతీ కార్యదర్శి సబియా, నాయుడు పాల్గొన్నారు.

రుద్రవరం: అర్హులైన ఏ ఒక్కరూ పథకాలకు దూరంగా ఉండిపోరాదని ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని తహసీల్దారు వెంకటశివ, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎల్లావత్తులలో గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన 276 మందికి ధ్రువ పత్రా లను అందజేశారు. ఎల్లావత్తుల, బీరవోలు సర్పంచులు చంద్రమోహన్, అంగా ఏలీషా తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ

నంద్యాల(సెంట్రల్): మూడు రోజులుగా జిల్లా కేంద్రంలోని విత్తన దుకాణాల్లో వ్యవసాయాధికారులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. డోన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అశోక్ వర్ధన్‌రెడ్డి, బీసీ ల్యాబ్ ఏఓ కళ్యాణ్ కుమార్, నంద్యాల ఏఓ ప్రసాద్ బృందం అన్నపూర్ణ సీడ్స్, దత్తాత్రేయ సీడ్స్, నందిని సీడ్స్, నంది ఆగ్రోటెక్‌లో స్టాక్‌బోర్డు, బిల్లు పుస్తకాలు, సరకు నిల్వలను పరిశీలించారు. అన్నపూర్ణ సీడ్స్‌లో సరైన ధృవపత్రాలు లేని రూ.4.97 లక్షల విలువైన 162 క్వింటాళ్ల వరి విత్తనాల అమ్మకాలను నిలిపివేశారు. ఏడీఏ మాట్లాడుతూ దుకాణ యజమానులు, విత్తన శుద్ధి కేంద్రాల నిర్వాహకులు అనుమతులు ఉన్న విత్తనాల్ని మాత్రమే అమ్మాలని విత్తనాలు కొన్న ప్రతి రైతుకు బిల్లు కచ్చితంగా ఇవ్వాలని సూచించారు.

చాగలమర్రి: స్థానిక చింతల చెరువు రస్తాలోనున్న శ్రీసాయి శ్రీనివాస ట్రేడర్స్ క్రిమిసంహారక మందుల దుకాణాన్ని మండల వ్యవసాయాధికారి రంగ నేతాజీ గురువారం తనిఖీ చేశారు. బిల్లు పుస్తకాలు, మందుల నిల్వలను పరిశీలించారు. మందుల కొనుగోలుకు సంబంధించి సరైన బిల్లులు లేక పోవడంతో రూ.2.0లక్షల విలువైన క్రిమిసంహారక మందుల అమ్మకాలను నిలిపి వేశారు.

రజకులకు భూములు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): రజకులకు ఇనాం భూములు ఇవ్వాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు కోరారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో రజక వృత్తి దారుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తరతరాలుగా రజక వృత్తిని కొనసాగిస్తున్న రజక వృత్తి దారుల సమస్యలపై అనంతపురంలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 21వ తేదీన జరిగే సదస్సుకు తరలిరావాలన్నారు.

యార్డు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ఆళ్లగడ్డ: పట్టణంలోని మార్కెట్ యార్డు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డు సమావేశ భవనంలో గురువారం యార్డు పాలక మండలి సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యార్డు ఆదాయం పెంచేందుకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు.

రీ సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు

దొర్నిపాడు: రీ సర్వే పనుల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తగా చేయాలని తహసీల్దార్ జయప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల, గ్రామ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. రీసర్వేను రికార్డుల్లో తప్పులేకుండా నమోదు చేయాలన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయం

నంద్యాల(రూరల్): పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అయ్యలూరు గ్రామంలో సచివాలయ మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడప తిరిగి లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పథకాల అమలు తీరు, ఎంత మేర లబ్ధి చేకూరిందో ఆరా తీశారు. మరింత మందికి లబ్ధి చేకూర్చాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హులై పథకాలు అందని వారికి అందేలా చర్యలు చేపట్టి, వారికి అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను అందజేస్తారన్నారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు రవికుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ శివలలిత, సర్పంచ్ ఓబులేసు, మహమ్మద్ షఫీ, పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



అమ్మ ఒడి వస్తుందా.. అని విద్యార్థినిని అడుగుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు



ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల



లబ్ధి పొందిన పథకాలను చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే

శిరివెళ్ల: ఆళ్లగడ్డ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని గంగవరంలో రూ. 21 లక్షలతో నిర్మించిన నూతన రైతు భరోసా కేంద్రం, రూ.17 లక్షలతో గడప గడపకు మన ప్రభుత్వం కింద పూర్తి చేసిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం కింద కేవలం ఆరు నెలల్లోనే రూ.4.50 కోట్లతో సీసీ రోడ్లు వేయించామన్నారు. అనంతరం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 151 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. నాయకులు ప్రతాపరెడ్డి, రమణ, సర్పంచులు పెద్ది రమణయ్య, జింకల నాగన్న, బి.అబ్దుల్ సలాం, ఉశేని రెడ్డి, సర్ప నరసింహస్వామి ఆలయ చైర్మన్ రేవనూరు రామాంజనేయరెడ్డి, పీఆర్ డీఈ నరసింహుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శాంతన్న, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

చాగలమర్రి: సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చాగలమర్రిలో 3,4వ సచివాలయల పరిధిలోని కోటగడ్డ, మంగలి వీధి, మెయిన్ బజార్‌లలో పర్యటించి ఇంటింటికీ వెళ్లి పథకాలు, లబ్ధిని వివరించారు. పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మండల కన్వీనర్ జి.కుమార్‌రెడ్డి, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు దస్తగిరి, వైస్ ఎంపీపీ ముల్లా రఫి, కో-ఆప్షన్ సభ్యుడు జె.ఇబ్రహీం, ఉప సర్పంచ్ షేక్.మహమ్మద్ సోహెల్, నాయకులు నాయబ్ రసూల్, ఖాజాహుసేన్, చక్రం షబ్బీర్, ముల్లా ఖాదర్‌బాషా, ఎం.కొండయ్య, సి.వెంకటరమణ, ఎంపీటీసీలు లక్ష్మీరెడ్డి, షేక్షావలి, బబ్లూ షోయబ్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు గ్రామంలో వెలసిన గ్రామ దేవత గంగమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు . వేద పండితులు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలం నాయుడు పాలెంలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న దేవికా బాయిని లైంగికంగా వేధించిన డాక్టర్ నాగార్జున గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ కోరారు. స్థానిక కార్యాలయంలో గురువారం జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ ప్రవర్తనపై గతంలో ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఉషారాణి, రామచంద్రనాయక్, విక్రమ్ నాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ఆర్‌డీఓ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతున్న కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాబాఫకృద్దీన్ మాట్లాడుతూ వివిధ పనులపై వచ్చే వారిని కొంత మొత్తం ముట్టజెప్పాలని ప్రజలను వేధిస్తున్నాడని ఆరోపించారు.

నిధులు కేటాయించాలి

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర బడ్జెట్‌లో చేతి వృత్తి దారులకు 25 శాతం నిధులు కేటాయించాలని చేతి వృత్తి దారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో చిన్న సుబ్బయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి

ఉపాధ్యాయుల కొరత ఉన్న చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎస్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నాగరాజు అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అజాంబేగ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బదిలీల కౌన్సెలింగ్‌లో ఉపాధ్యాయుల స్థానాలను బ్లాక్ చేయడంతో ఖాళీల కొరత ఏర్పడిందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆళ్లగడ్డ: పట్టణంలోని పడకండ్ల దారిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న ఆరో తరగతి సీట్ల భర్తీ కోసం ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఫిర్దోస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని 8న పాఠశాలలోనే ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేవారు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, కులం, ఆదాయం, స్టడీ, పుట్టిన తేదీ, ఆధార్ కార్డులను తీసుకువాలని సూచించారు.